క్లుప్తంగా

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

లింగాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం గరీబ్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ బానోత్ జగన్‌నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు రమేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. రాథోడ్ అంబాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వాంకిడి: మండల కేంద్రంలో డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను దాతలు మహోల్కర్ అరుణ్, చాంద్‌లు ఆదివారం ప్రారంభించారు. టోర్నీలో 30 జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలతో పాటు ట్రోఫీ ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల విజేత 'గోలేటి'


ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల భీమన్న స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్‌లో గోలేటి జట్టు, తిర్యాణి మండలానికి చెందిన డేగ డెవిల్ జట్టుపై గెలుపొందింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వనజ, గోలేటి మాజీ సర్పంచ్ సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్, రాజేశ్, సురేందర్‌రాజు పాల్గొన్నారు.

గుడుంబా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

లింగాపూర్: గుడుంబా రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం లింగాపూర్ మండల కేంద్రంలోని ప్రజలతో మాట్లాడుతూ గుడుంబా తయారీ, విక్రయంపై నిషేధం ఉందన్నారు. అక్రమ మద్యం పూర్తిగా నిషేధించాలని, గ్రామాలలో బెల్ట్ షాపులను నడపొద్దన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ


టీకాలు వేస్తున్న వైద్యాధికారి సాగర్

రెబ్బెన: మండలంలోని సింగల్‌గూడలో ఆదివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించి ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 178 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ సాగర్ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్యాలు అదుర్స్

మంచిర్యాలఅర్బన్: స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్లో ది హ్యాపీ స్కాలర్ షిప్ స్కూల్ 22వ వార్షికోత్సవ సంబురాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలతో విద్యార్థులు అదరగొట్టారు. కార్యక్రమంలో ఎంఈవో పోచయ్య, కరస్పాండెంట్ విక్రమ్‌రావు, ట్రస్మా నాయకులు విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, ఉస్మాన్ పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం

లక్సెట్టిపేట: బీజేపీ పట్టణ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథరావు ఆదివారం స్థానిక ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ప్రకటించా రు. పట్టణాధ్యక్షుడిగా వీరమల్ల హరిగోపా ల్, ప్రధాన కార్యదర్శిగా సామ వెంకటరమణ, సతీష్, సాయి సచిన్, ఉపాధ్యక్షులు చాతరాజు శివశంకర్, వెంబడి వెంకటేష్, సమరసింహ, రమేష్, కొమాకుల రవి, శ్రీనివాస్, మోర్చా కమిటీ బీసీ సభ్యులు పాంచాల రమేష్, ఎస్సీ సభ్యులు మామిడాల శంకర్, ఎస్టీ సభ్యులు ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు కళావతి, బీజేవైఎం అధ్యక్షులు బుద్దె సిద్దార్థ్ లను నియమించినట్లు తెలిపారు.

నిధులు రాక నిలిచిన పనులు

- అసంపూర్తిగా కర్వెతగూడ వంతెన పనులు
- ఇప్పటికీ 70శాతం పూర్తి
- బిల్లులు రాక అర్ధంతరంగా నిర్మాణం నిలిపివేత


పూర్తి కాని బీటీ రోడ్డు


అర్ధంతరంగా నిలిచిన వంతెన పనులు

కెరమెరి: వాగులు, వరదల వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామీణులను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం మండలంలోని కర్వెతగూడ వద్ద మంజూరు చేసిన వంతెన పనులు ముందుకు సాగడం లేదు. నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన ఆదివాసీలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వానలు పడితే మళ్లీ రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. సాంగ్వి గ్రామ పంచాయతీకి చెందిన కర్వెతగూడ, రావుజీగూడ, రాంనగర్ గ్రామాల్లో సుమారు 300లకు పైగా జనాభా ఉంది. ఆ గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా కర్వెతగూడ వద్ద రహదారిపై వంతెన నిర్మాణం చేపడుతున్నారు.

ఇప్పటికే రూ.1.30 కోట్లు ఖర్చు

ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రోడ్డు)పథకంలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 2.50 కోట్లు నిధులతో మే, 2023లో వంతెన మంజూరైంది. సంబంధిత గుత్తేదారు జూలై వరకు 70 శాతం పనులు కూడా పూర్తి చేశారు. దీని నిర్మాణానికి రూ.1.30 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాకపోవడంతో వంతెన నిర్మాణ పనులను నిలిపివేశారు. అయితే ప్రభుత్వం మంజూరు చేస్తామన్న రూ.2.50 కోట్లు సరిపోవని అదనంగా మరో రూ.1.30 కోట్లు పెంచాలని ప్రభుత్వానికి ఇంజినీరింగ్ అధికారులు గతంలోనే నివేదికలు అందించారు. కానీ ఇప్పటి వరకు వెచ్చించిన నిధులు కూడా అందలేదు. కాగా వంతెన నుంచి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు మంజూరైంది. కాని ఆ నిధులు కూడా విడుదల కాకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి.

ఒక్క రూపాయి విడుదల కాలేదు



వంతెన నిర్మాణ పనులు 70శాతం పూర్తి చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నాయి. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. వంతెనకు ఇప్పటి వరకు రూ.1.30 కోట్లను గుత్తేదారు వెచ్చించారు. నిధులు విడుదలైతే తప్పా పనులు ప్రారంభం కావు.

– స్టీవెన్, పీఆర్ఏఈ, కెరమెరి

ప్రభుత్వం స్పందించాలి



వంతెన లేకపోవడంతో ఎన్నో ఏళ్లగా వరద నీటితో వానాకాలంలో కష్టాలు పడుతున్నాం. ఎన్నో వినతులు తర్వాత గత ప్రభుత్వం వంతెన మంజూరు చేసింది. కానీ నిధులు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బిల్లులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలి.

– జగన్నాథ్‌రావు, మాజీ సర్పంచ్, సాంగ్వి

పోషకాహారంపై అవగాహన

- ప్రారంభమైన ఆరో విడత పోషణ్ పక్వాడ
- పౌష్టికాహారంపై విస్తృత ప్రచారం
- మార్చి 23 వరకు కార్యక్రమం


చేద్వాయిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పెంచికల్‌పేట్: పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పోషకాహార ప్రాముఖ్యత ప్రతీ ఒక్కరికి తెలియజేసేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మార్చి 9వ తేదీన ప్రారంభమైన కార్యక్రమం మార్చి 23 వరకు కొనసాగనుంది. విద్య, వైద్య, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బంది సంయుక్తంగా ఆరవ విడత కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పౌష్టికాహారం పంపిణీ..

మండలంలో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 0 నుంచి 3 సంవత్సరాల పిల్లలు 656 మంది, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు 648 మంది, గర్భిణులు 154 మంది, బాలింతలు 74 మంది ఉన్నారు. వీరికి ప్రతీ నెల అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిత్యం పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందజేస్తున్నారు. అయినా 26 మందిలో పోషకాహారం లోపం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత ఏడాది నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయా కేంద్రాల్లో 174 మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వారికి ప్రభుత్వం పౌష్టికాహార కిట్లను అందిస్తూ నిత్యం తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో సంఖ్య 26కు తగ్గినట్లు అధికారులు వివరించారు.

ఇంటింటా పోషణ సంబరాలు..

పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 15 రోజులు పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఇంటింటా పోషణ సంబరాలు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, మహిళలు, కిశోర బాలికలకు తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరిస్తున్నారు. పౌష్టికాహారంలో భాగంగా తృణధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, మినుములు, పెసర్లు, రాగి జావ ప్రతీరోజు తీసుకునేలా నిత్యం సదస్సులు నిర్వహిస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

పోషణ్ పక్వాడలో భాగంగా ఇంటింటా పోషకాహార సంబరాలను నిర్వహిస్తున్నాం. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లతో కలిసి బాలికలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య పరీక్షలను నిర్వహించి ఐరన్ లోపాన్ని నివారిస్తున్నాం. ప్రతీ ఇంటిలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పెంచికల్‌పేట్

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ గోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో 143 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ఎనిమిది హైస్కూల్‌లు ఉండగా 269 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇట్యాలలో 44, బీబ్రా 19, దహెగాం 49, కేజీబీవీ 34, సెయింట్ ఫ్రాన్సిస్ ప్రైవేటు 52, కల్వాడ ఆశ్రమ పాఠశాల 19, కుంచవెల్లి 27, చినరాస్పెల్లి 25 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 149 మంది, కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 120 మంది పరీక్ష రాయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం సీఎస్ కిషన్‌రావు, డీవో నరేందర్‌రావు, కేజీబీవీలో సీఎస్ అమరేందర్ రెడ్డి, డీవో సుధాకర్‌లను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో భిక్షపతి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి, వైద్య సదుపాయం కల్పించామన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతున్నందున విద్యార్థులు 40 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని రవీంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాబాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, కేతిని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, చింతలమానెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 211 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. కేజీబీవీలో 124 మంది విద్యార్థులకు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా హన్మంతు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా భుజంగరావు, 8 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాలలో 87మంది విద్యార్థులకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పి.జయరాజ్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా నాందేవ్, ఏడుగురు ఇన్విజిలేటర్లను నియమించారు.

లింగాపూర్: విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల విద్యాధికారి కుడ్మెతా సుధాకర్ అన్నారు. నేటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

కౌటాల: ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వాహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో సోమయ్య ఆదివారం తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లుగా జయంతి, సత్యనారాయణ, డీవోలుగా రవికుమార్, లక్ష్మణ్‌లను నియమించినట్లు తెలిపారు. మండలంలో 366 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం కౌటాల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జెడ్పీ పాఠశాలలో 220 మంది విద్యార్థులు, కళాశాలలో 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 21 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

'ఉపాధి'లో సౌకర్యాలు నిల్

- ఎండలో పని చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు


ఎండలో పని చేస్తున్న కూలీలు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకంలో కూలీలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. నానాటికీ పెరుగుతున్న ఎండలతో ఉపాధి కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పని ప్రదేశాల్లో అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి దూరంగా పని ఉంటే రాకపోకలకు కూలీలు అనేక అవస్థలు పడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 91 వేల జాబ్ కార్డులు ఉండగా, 1.78 లక్షల మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. వేసవిలో ఎలాంటి పనులు లేక చాలా మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడతారు. గ్రామాల్లో హాజరు శాతం ఎక్కువగా నమోదవుతోంది. 2017 వరకు ఉపాధిహామీ కూలీలకు పలుగు, పారలు, తట్టలు ఇచ్చారు. అనంతరం వాటి సరఫరా ఆగిపోయింది. గతంలో వేసవిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సైతం కూలీలే వెంట తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సేదతీరడానికి సమీపంలోని చెట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. చెట్లు లేనిచోట తువ్వాల, కొంగులు కప్పుకొని ఎండలోనే కూర్చుంటున్నారు.

సహాయకులు లేక ఇక్కట్లు..

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీనియర్ మేటీలే పనులు చూసుకుంటున్నారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు సరిగా సాగడం లేదు. కొన్ని చోట్ల పాత పంచాయతీల్లో పనిచేసే క్షేత్ర సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు ఉన్న చాలా మంది కూలీలకు ఆధార్ లింక్ కాక పనులు చేయలేకపోతున్నారు. దీంతో పాటు పాత జీపీల నుంచి కొత్త జీపీలకు మారడంతో కొంత మంది పేర్లు సాఫ్ట్‌వేర్‌లో రెండు జీపీల్లో ఉంటుండడంతో ఆధార్ అనుసంధానం కాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం వచ్చిన నూతన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు.

తాగునీటి సౌకర్యం లేదు



పని ప్రదేశంలో తాగు నీరు, నీడ వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి నుంచి నీటిని తీసుకెళ్తున్నాం. ఎండ వేడికి కొద్ది సేపటికే నీరు వేడవుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటినే తాగాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం తాగు నీరు ఏర్పాటు చేయాలి.

– చత్రు, మోతుగూడ

రాను.. పోను రూ.40 అవుతుంది



మా గ్రామం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉపాధిహామీ పనులు చేస్తున్నాం. రోజుకు రాను..పోను రూ.40లు చార్జీలకే పోతున్నాయి. గతంలో కూలీతో పాటు అదనంగా 20 నుంచి 30శాతం వేసవి భత్యం చెల్లించేవారు.

– లక్ష్మణ్, మోతుగూడ

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 11 అడుగుల మహంకాళి విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులకు అలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ అన్నదానం ఏర్పాటు చేశారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు గౌరవంగా నడుచుకోవాలి

మందమర్రిరూరల్: ప్రతీ మహిళా కుటుంబంలో అమ్మగా, తోబుట్టువులా అనేక పాత్రల్లో గౌరవంగా నడుచుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలందించిన మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం సభ్యులు భాగ్యలక్ష్మి దంపతులను మెమొంటో అందించి శాలువా కప్పి సన్మానించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి శివాలయంలో యంత్రమూర్తి ప్రతిష్ఠాపన

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయ (శివాలయం) పునఃనిర్మాణం చే పట్టిన సందర్భంగా ఈ నెల 18నుంచి 20వ తేదీ వరకు గంగాధర శివపంచాయతన నవగ్రహ శిఖర, యంత్రమూర్తి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవంతో పాటు హన్‌మాన్, శివాలయాల్లో ధ్వజస్తంబాల శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలువేరు సుదర్శన్, ఉపాధ్యక్షుడు దొంతుల రాజన్న, హన్‌మాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు నూతి స్వామి తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమం, పూజాభిషేకం, నవగ్రహ ఆలయ ధ్వజశిఖర యంత్రమూర్తి స్థిరప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమంలో శ్రుంగేరి గంగా పీఠాధిపతి పురుషోత్తమ భారతి మహాస్వామి పాల్గొని మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని దుబ్బగూడెంకు చెందిన రత్నం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సేకరించిన నగదు రూ.10వేలతో పాటు 25కిలోల బియ్యం బాధిత కుటుంబానికి సంఘం అధ్యక్షుడు దుర్గయ్యతో పాటు సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉన్నారు.

విచారణ చేపట్టాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వహీదా మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అభిషేకం నిర్వహిస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో గల అయ్యప్పస్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అష్టదశ కళషాభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం భజన, పడిపూజ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుణ్య స్నానాలకు ముదిరాజ్‌లు



భీమారం: మండల కేంద్రం నుంచి చెన్నూర్ గోదావరి నదికి ఆదివారం ముదిరాజ్‌లు గ్రామదేవతలతో పాటు పాదయాత్రగా వెళ్లి పుణ్యస్నానాలు చేశారు. సోమవారం లక్ష్మీదేవి ఆలయంలో నిర్వహించే బోనాలను పురస్కరించుకొని ముదిరాజ్‌లు ఉపావాస్య దీక్షలు చేపట్టారు. ఈ మేరకు గ్రామదేవతలను తీసికెళ్లినట్లు తెలిపారు. బోనాల పండుగకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.

కంకర పోశారు.. పనులు మరిచారు!


లింగాపూర్-అల్లీపూర్ మధ్య నిలిచిన పనులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ నుంచి అల్లీపూర్ వరకు, దండేపల్లి నుంచి నర్సాపూర్, కన్నెపల్లిలో నిర్మించే బీటీ రోడ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు కంకర పోసి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. దీంతో ఈ రోడ్ల గుండా ప్రయాణించేందుకు ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రుంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899